క్లుప్తంగా

చంద్రమౌళీశ్వరుడికి పుష్పాభిషేకం



పుష్పాభిషేకంలో పాల్గొన్న మహిళలు

నారాయణఖేడ్: మండలం పరిధి వెంకటాపూర్ చౌరస్తా సమీపంలోని భక్త మార్కండేయ స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం చంద్రమౌళీశ్వరుడికి పుష్పార్చన, పుష్పాభిషేకం, మహాహారతి, గీతాపారాయణం, హనుమాన్ చాలీసా, లలితా సహస్రనామావళి, పూజలు, భజన తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. సత్యగామ గ్రామానికి చెందిన పద్మశాలి కులబాంధువుల ఆధ్వర్యంలో మహా అన్నప్రసాద వితరణ చేపట్టారు. మహిళా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

శిథిలావస్థలో ప్రభుత్వ కళాశాల



పెచ్చులు ఊడిపోయి బయటకు తేలిన స్లాబ్

సంగారెడ్డి క్రైమ్: సంగారెడ్డి ప్రభుత్వ ఐటీఐ కళాశాల శిథిలావస్థకు చేరింది. వర్షాలకు భవనం పాకురు పట్టింది. స్లాబ్ పెచ్చులు ఊడిపోయి ఇనుప చువ్వలు, సిమెంట్ రాలిపోయి ఎప్పుడూ కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. వర్షాలకు ఎప్పుడు కూలుతోందని విద్యార్థులు భయంతో వణికిపోతున్నారు. ప్రభుత్వం స్పందించి యుద్ధ ప్రాతిపదికన నూతన భవనం నిర్మించాలని కోరుతున్నారు.

జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడిగా గౌసొద్దిన్



జోగిపేట(అందోల్): సంగారెడ్డి జిల్లా వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడిగా అందోల్ మండలం పోసానిపేట గ్రామానికి చెందిన ఎండీ గౌసొద్దిన్‌ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా జోగిపేటకు చెందిన వీబీ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా మారుతి, కోశాధికారిగా కృష్ణయ్య గౌరవ అధ్యక్షుడిగా కే.శ్రీనివాస్, మహిళా కార్యదర్శిగా సౌజన్యతో పాటు సభ్యులు, సలహాదారులను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ.. జిల్లాలో నిర్వహించే అన్ని రకాల క్రీడలు, వ్యాయామ విద్య కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తామన్నారు. వ్యాయామ విద్యలో సంగారెడ్డి జిల్లాను ఉన్నత స్థానంలో నిలబెడతామని అన్నారు. జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నికయ్యేందుకు సహకరించిన వ్యాయామ ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు.

తప్పుడు పత్రాలు జారీ చేస్తే చర్యలు

తహసీల్దార్ జయరాం



మీసేవ కేంద్రాన్ని సీజ్ చేస్తున్న అధికారులు

సంగారెడ్డి టౌన్: మీసేవ కేంద్రాల్లో తప్పుడు పత్రాలు జారీ చేస్తే కఠిన చర్యలు తప్పవని సంగారెడ్డి తహసీల్దార్ జయరాం అన్నారు. సోమవారం పట్టణంలోని లాల్‌సాబ్ గడ్డలో ఆరిఫ్ కమ్యూనికేషన్‌లో తప్పుడు జనన ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్నారని సమాచారం అందడంతో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు సీజ్ చేసినట్లు తెలిపారు. జిల్లాలోని మీసేవ కేంద్రాలు తప్పుడు ధ్రువపత్రాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని లేకపోతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట సంగారెడ్డి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ సీఐ మహేశ్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి



ఫార్మర్ రిజిస్ట్రీ చేస్తున్న నూతన్‌కుమార్

కల్హేర్(నారాయణఖేడ్): ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరిగా చేసుకోవాలని నారాయణఖేడ్ ఏడీఏ నూతన్‌కుమార్ రైతులకు సూచించారు. సోమవారం కల్హేర్‌లో ఫార్మర్ రిజిస్ట్రీ గురించి అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్, తదితర పథకాలకు సంబంధించి విశిష్ట గుర్తింపు కార్డులు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. కృష్ణాపూర్‌లో ఏఓ వెంకటేశం ఫార్మర్ రిజిస్ట్రీ చేపట్టారు. కార్యక్రమంలో ఏఈఓలు సంతోష, కృష్ణవేణి పాల్గొన్నారు.



ప్రమాదకరంగా ఇనుప చువ్వల రవాణా

సంగారెడ్డితో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో నిత్యం ఏదో ఒకచోట ఇళ్లు , భవన సముదాయాల నిర్మాణాలు జరుగుతూనే ఉన్నాయి. నిర్మాణ రంగంలో ప్రధానంగా వాడే ఇనుప సీకులను ప్రమాదకరంగా తరలిస్తున్నారు. చిన్నపాటి ట్రాలీ ఆటోలో వెనుక పెట్టుకుని తీసు కెళ్తున్నారు. నగం సీకులు ఆటోలో, మిగతా నగం ఆటో బయట వేలాడుతూ ఉంటాయి. ఇలా తరలించడం వల్ల వెనుక నుంచి వచ్చే వాహనదారులు సీకులు గమనించక ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి



తరగతులు ఐదు.. గదులు రెండు

- సౌకర్యం లేక విద్యార్థుల ఇబ్బందులు
- మాటల్లోనే అభివృద్ధి.. ఆచరణలో శూన్యం
- పలు చోట్ల తాగునీరు, గదులు లేక తిప్పలు

ప్రభుత్వం పాఠశాలల్లో మౌలిక వసతుల, నాణ్యమైన విద్య అందుతుందని ప్రభుత్వ పెద్దలు చెబుతున్నా.. ఆచరణలో మాత్రం సాధ్యం కావడం లేదు.. ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించేవారు లేకపోవడంతో విద్యార్థులు తిప్పలు పడుతున్నారు. తాగు నీరు, తగినన్ని గదులు లేక అవస్థలు ఇబ్బందులు పడుతున్నారు.



గదులు లేకపోవడంతో వరండాలోనే చదువుకుంటున్న విద్యార్థులు

కంది(సంగారెడ్డి): ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులకు నాణ్యమైన బోధనను అందించేందుకు కృషి చేస్తున్నామని ప్రభుత్వం చెప్తున్నా ఆచరణలో సాధ్యం కావడం లేదు. పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికీ భవనాలు, గదుల కొరత, స్థలాల కొరతతో విద్యార్థులు, ఉపాధ్యాయులు అవస్థలు పడుతూనే ఉన్నారు. అరకొర వసతుల మధ్య పాఠశాలల్లో బోధన సాగుతోందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. కంది మండల పరిధిలోని పలు పాఠశాలల్లో కలిసి సౌకర్యాలు కరువయ్యాయి. కంది లక్ష్మీనగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఐదు తరగతులు, 120 మంది విద్యార్థులు ఉండగా కేవలం రెండు తరగతి గదులు మాత్రమే ఉన్నాయి. దీంతో కొంత మందిని టీచర్లు ఉండే చోట, మరో రెండు తరగతులను వరండాలో కూర్చోబెట్టి బోధన చేస్తున్నారు. వర్షం కురుస్తున్నప్పుడు ఒక్కో గదిలో రెండు తరగతులను ఒకే చోట కూర్చోబెట్టాల్సి వస్తుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. దీంతో విద్యార్థుల ఏకాగ్రత దెబ్బతిని చదువుకోలేకపోతున్నారని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా మరోవైపు విద్యార్థులకు నీటి సమస్య ఏర్పడుతోంది. మంజీరా నీటి కోసం ఏర్పాటు చేసిన సంపు భూమికి సమాంతరంగా నిర్మించారు. ఆ సంపులో పాములు బల్లులు పడి చనిపోతుండడంతో విద్యార్థుల ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉందని ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. విద్యార్థులకు తాగునీరు అందించేందుకు ప్రత్యేకంగా ఓ ట్యాంకును ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. పాఠశాల ఆవరణలో స్థల సౌకర్యం ఉన్నందునా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి విద్యార్థులకు సరిపోయేలా అదనపు గదులను నిర్మించాలని. విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

చిరు వ్యాపారులను ప్రోత్సహిస్తాం

ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: చిరు వ్యాపారులను ప్రోత్సహించి సహకారం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. సోమవారం ఖేడ్ పట్టణంలోని రాజీవ్‌చౌక్ వద్ద 100 రోజుల ప్రణాళికలో భాగంగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో స్ట్రీట్ ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం నిర్వహించారు. చిరువ్యాపారుల దుకాణ స్టాళ్లను ఎమ్మెల్యే పరిశీలించి వారితో మాట్లాడి ఉపాధి ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. వీధి వ్యాపారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని వారికి వివరించారు. మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, మాజీ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, మాజీ వైస్ చైర్మన్ దారం శంకర్, కౌన్సిలర్ వివేకానంద్, నాయకులు తాహెర్, ముంతాజ్, పండరిరెడ్డి, అవుటి శంకర ముదిరాజ్ పాల్గొన్నారు.



కొబ్బరి బోండాం నీళ్లు తాగుతున్న ఎమ్మెల్యే



దేవికి సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

న్యాయవాది దేవికి సన్మానం

సంగారెడ్డి టౌన్: ఎల్ఎల్‌బీ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన దేవికి సంగారెడ్డి బార్ అసోసియేషన్ అభినందించారు. సభ్యురాలు దేవిని, కాకతీయ విశ్వవిద్యాలయ వీసీ సోమవారం స్వర్ణ పతకంతో సన్మానించారు. అనంతరం సంగారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ వేడుకలో ప్రధాన కార్యదర్శి మహేశ్, సీనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

వాయు కాలుష్యంపై ఫిర్యాదు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ ప్రాంతంలో పెరుగుతున్న వాయు కాలుష్యాన్ని అరికట్టాలని మాజీ కౌన్సిలర్ రాములు నేత సోమవారం కలెక్టర్ ప్రావీణ్యను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జహీరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఉన్న పరిశ్రమల నుంచి వ్యాపారులు వ్యర్థ పదార్థాలను సేకరిస్తున్నారని అన్నారు. ఉపయోగంలోకి రాని వాటిని బహిరంగ ప్రదేశాల్లో కాలుస్తున్నారని, వ్యవసాయ బావుల్లో పారబోస్తున్నారని తెలిపారు. చెత్తను కాల్చడం వల్ల విడుదలయ్యే హానికరమైన వాయువు గాలిని కలుషితం చేస్తుందన్నారు. శ్వాసకోశ తదితర సమస్యలకు దారితీస్తుందని వాపోయారు. వ్యర్థపదార్థాలను తిని పశువులు మృతి చెందుతున్నాయని మండిపడ్డారు. కాలుష్య నియంత్రణ అధికారులతో తనిఖీలు నిర్వహించి వాయు కాలుష్యాన్ని అరికట్టాలని కోరారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న రాములు నేత

బెస్ట్ వెంచర్ అక్రమాలపై ఫిర్యాదు

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం మంగంపేట గ్రామంలో బెస్ట్ వెంచర్ యాజమాన్యం ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తోందని గ్రామస్తులు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. పంచాయతీ పరిధిలోని సర్వేనం 36లో బెస్ట్ వెంచర్ యాజమాన్యం ప్రభుత్వ భూములను కబ్జా చేస్తూ అక్రమ నిర్మాణాలు చేపడుతుందని కలెక్టర్‌కు వివరించారు. ఈ విషయంపై తహసీల్దార్ కార్యాలయంలో పలుమార్లు ఫిర్యాదులు చేసిన ఎలాంటి చర్యలు తీసుకోలేదని వాపోయారు. క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి ప్రభుత్వ భూములను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వెంకటేశ్, శ్రీకాంత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

మున్సిపల్ కమిషనర్ అజయ్ కుమార్ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో పారిశుద్ధ్యం అమలుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ అజయ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని కొల్లూరు చెత్త డంపింగ్ యార్డ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి నుంచి డంపింగ్ యార్డ్‌లో బయోమైనింగ్ ప్రక్రియను మొదలు పెట్టనున్నట్లు తెలిపారు. తడి, పొడి చెత్తను వేరు చేసి ఎరువును తయారు చేస్తున్నట్లు చెప్పారు. డంపింగ్ యార్డ్‌ను మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ప్రజలు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయొద్దన్నారు. ఇంటి వద్దకు వచ్చే స్వచ్ఛ ఆటోలకే చెత్తను ఇవ్వాలని సూచించారు. మున్సిపల్ పరిధిలో చెత్త సేకరించే ఆటోలకు స్టిక్కరింగ్‌తో పాటు జీపీఎస్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. అనంతరం కొల్లూరు డబుల్ బెడ్రూం ఇళ్ల సముదాయంలో నూతనంగా అభివృద్ధి చేస్తున్న పార్కు స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డీఈ సత్యనారాయణ, ఏఈ మౌనిక, మేనేజర్ అఖిల్ తదితరులు పాల్గొన్నారు.



చెత్తను వేరు చేసే ప్రక్రియను పరిశీలిస్తున్న కమిషనర్

రూ.20కోట్లతో పటాన్‌చెరులో ఆడిటోరియం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా రూ.20 కోట్లతో పట్టణంలో ఆడిటోరియం నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని.. ఆధునిక వసతులతో అందరికీ ఉపయోగపడేలా 4000 మంది సీటింగ్ సామర్థ్యంతో ఆడిటోరియం నిర్మిస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని బ్లాక్ ఆఫీస్ ప్రాంగణంలో నిర్మిస్తున్న ఆడిటోరియం పనులను జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశంలో విప్లవాత్మక ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు.. తెలంగాణ గొప్పతనాన్ని విశ్వవ్యాపితం చేసిన దేశ మాజీ ప్రధాని పీవీ నరసింహారావు పేరుని ఆడిటోరియానికి పెడుతున్నట్లు తెలిపారు. ఆడిటోరియానికి ఎదురుగా పీవీ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. భవిష్యత్తు తరాలకు పీవీ నరసింహారావు గొప్పతనాన్ని తెలియజేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఆడిటోరియం నిర్మాణానికి గతంలో ఏఎస్ఎన్ ఫార్మా పరిశ్రమ 8 కోట్ల రూపాయలు, అరబిందో సంస్థ రెండు కోట్ల రూపాయల సీఎస్ఆర్ నిధులు కేటాయించామని చెప్పారు. ఇటీవల జీహెచ్ఎంసీ నుంచి నాలుగు కోట్ల రూపాయలు నిధులు మంజూరయ్యాయన్నారు. వివిధ పరిశ్రమల సహకారంతో మిగిలిన రూ.6 కోట్ల నిధులు ఆడిటోరియం అభివృద్ధికి కేటాయించనున్నట్లు తెలిపారు.అతి త్వరలో నిర్మాణ పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఈఈ సురేష్, డీఈ నరేందర్ ఏఈ శివకుమార్ పాల్గొన్నారు.



అధికారులతో కలిసి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే



సభ్యత్వం అందజేస్తున్న తులసీరాం తదితరులు

పీఆర్టీయూ సభ్యత్వ నమోదు

జహీరాబాద్ టౌన్: మండలం పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించామని జిల్లా గౌరవ అధ్యక్షుడు తులసీరాం రాథోడ్ తెలిపారు. మండలంలోని బూచినెల్లి, సత్వార్, చిరాగ్‌పల్లి, శేఖాపూర్, మల్‌చల్మె తదితర పాఠశాలకు సోమవారం వెళ్లి సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టమన్నారు. ఉపాధ్యాయులకు ఇన్సూరెన్స్‌తో కూడిన సభ్యత్వం ఇచ్చామన్నారు. కార్యక్రమంలో నాయకులు భాగయ్య, అర్జున్, అశోక్, శ్రీనివాస్, వరాలు, ప్రసాద్, సతీష్‌గౌడ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవిత దిష్టిబొమ్మ దహనం

మునిపల్లి(అందోల్): ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై ఎమ్మెల్సీ కవిత అనుచరులు చేసిన దాడికి నిరసనగా మల్లన్న టీం రాష్ట్ర నాయకులు రమేశ్ యాదవ్ ఆధ్వర్యంలో కవిత దిష్టిబొమ్మను దహనం చేశారు. సోమవారం మండలంలోని బుదేరా చౌరస్తా సమీపంలో 65వ నంబర్ జాతీయ రహదారిపై దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో తీన్మార్ మల్లన్న మండల నాయకులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయండి

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి: పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అధికారులకు సూచించారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పబ్లిక్ హెల్త్ ఈఈ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. టీయూఎఫ్‌ఐడీసీ నిధుల ద్వారా సంగారెడ్డి, సదాశివపేటలో చేపడుతున్న పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అమృత్ జల పథకం పెండింగ్ పనులపై ఆరా తీశారు. సంగారెడ్డి పట్టణానికి రూ.44 కోట్లు, అలాగే సదాశివపేట రూ.8.5 కోట్లతో అమృత్ జల పథకం ద్వారా మంజూరైన పనుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న తొమ్మిది పనులపై ఎస్ఈతో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమీక్షలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ కృష్ణ మోహన్ తదితరులు ఉన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్

స్వచ్ఛతలో భాగస్వాములు కావాలి

ఆర్‌డీఎంఏ అధికారి శ్రీనివాసరావు

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీలో వంద రోజుల ప్రణాళిక కార్యక్రమాలు నిర్విరామంగా కొనసాగుతున్నాయి. సోమవారం ప్రణాళిక కార్యక్రమంలో రీజనల్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారి శ్రీనివాసరావు పాల్గొని నగర పరిధిలోని డంపింగ్ యార్డ్, వైకుంఠధామం, క్రీడా ప్రాంగణాల పురోగతిని తెలుసుకున్నారు. వివిధ వార్డుల్లో చేపట్టిన పారిశుద్ధ్య పనులను కమిషనర్ కిషన్‌తో కలిసి పరిశీలించారు. నగరంలోని ప్రతివార్డుల్లో పరిసర ప్రాంతాల్లో శుభ్రత కల్పించాలని ప్రణాళికలో ప్రతి ఒక్కరిని భాగస్వాములను చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఈ సత్యనారాయణ, మేనేజర్ మల్లికార్జున్‌రావు, వార్డు ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రణాళిక పనులను పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

డబుల్ ఇళ్ల పంపిణీకి నోటిఫికేషన్

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ సమీపంలో హోతి(కె) వద్ద నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీకి రెవెన్యూ అధికారులు చర్యలు ప్రారంభించారు. తహసీల్దార్ దశరథ్ సోమవారం మాట్లాడుతూ.. హోతి(కె) వద్ద నిర్మించిన 660 డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీ కోసం నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. తహసీల్దార్, ఆర్డీఓ, మున్సిపల్, ఎంపీడీఓ కార్యాలయాల వద్ద లబ్ధిదారుల జాబితాను ఉంచామని చెప్పారు. ఏమైనా ఫిర్యాదులు ఉంటే మూడు రోజుల లోపు తమకు తెలపాలని చెప్పారు. నోటిఫికేషన్ సమయం ముగిసిన తరువాత లబ్ధిదారులకు ఇళ్లను అప్పగిస్తామన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ మందుబాబులకు జరిమానా

సంగారెడ్డి క్రైమ్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పట్టణ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ రామకృష్ణారెడ్డి కథనం ప్రకారం.. ఆదివారం అర్ధరాత్రి పట్టణంలోని పాత బస్టాండ్, పోతిరెడ్డిపల్లి చౌరస్తా, బైపాస్‌లోని గుర్రపుబొమ్మ వద్ద నిర్వహించిన తనిఖీల్లో 16మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని సోమవారం కోర్టులో హాజరుపరచగా జిల్లా అదనపు న్యాయమూర్తి షకీల్ అహ్మద్ సిద్దికీ 11 మందికి రూ.2000, ముగ్గురికి రూ.1500, మిగతా ఇద్దరికి రూ.1000, చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

◆ క్రీడాస్థలం కోసం వినతి

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని బాలాజీనగర్‌లో నిరుపయోగంగా ఉన్న అగ్నిమాపక కేంద్రం స్థలాన్ని క్రీడాప్రాంగణంగా ఉపయోగించుకోవడానికి అవకాశం కల్పించాలని గుండ్ల భార్గవ్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజావాణిలో వినతిపత్రాన్ని అందజేశారు. జననివాలసాల మధ్య స్థలం ఖాళీగా ఉండడంతో చెత్తాచెదారాలతో నిండిపోయి దుర్వాసనలు వెదజల్లుతుందని వివరించారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ అగ్నిమాపక శాఖ అధికారులతో చర్చించి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

◆ గడువు పొడిగింపు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: జాతీయ స్థాయి పురస్కారం (నేషనల్ బెస్ట్ టీచర్ అవార్డు) కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 17వరకు తేదీని పొడిగించినట్లు జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల ఉపాధ్యాయులు http://nationalawardsotreacherr.education.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో అప్‌లై చేసిన తరువాత ప్రింట్ తీసుకొని సంబంధిత పత్రాలను జతపరిచి 17 సా.5 గంటలలోపు డీఈఓ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

◆ మంత్రి దామోదరను కలిసిన వైద్యనాథ్

సంగారెడ్డి జోన్: వ్యవసాయ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డా.డి.వైద్యనాథ్ వ్యవసాయ అధికారి నుంచి సహాయ సంచాలకులుగా పదోన్నతి పొందటంతో మంత్రి దామోదరను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రైతులకు మరింత సేవలందించాలని మంత్రి సూచించారు. వారితో పాటు గ్రౌండ్ వాటర్ అధికారి సంతోష్‌కుమార్ ఉన్నారు.

◆ చెక్కుల పంపిణీ వాయిదా

నారాయణఖేడ్: నియోజకవర్గంలోని కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు సోమవారం పంపిణీ చేయాల్సిన చెక్కుల పంపిణీ కార్యక్రమం అనివార్య కారణాల వల్ల ఈనెల 16 బుధవారానికి వాయిదా పడిందని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రతినిధులు తెలిపారు.

◆ మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా మధుసూదన్

హత్నూర(సంగారెడ్డి): మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా హత్నూర మండలం దౌల్తాబాద్ గ్రామానికి చెందిన సామాజిక సేవ కార్యకర్త గుండా మధుసూదన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సంస్థ నేషనల్ ప్రెసిడెంట్ అండ్ ఫౌండర్ డాక్టర్ ఎం.శ్రీలత, తెలంగాణ చైర్మన్ వరలక్ష్మి నియామక పత్రాన్ని అందజేసి గుండా మధుసూదన్‌కు బాధ్యతలు అప్పగించారు. సామాజిక, వ్యక్తిగతంగా బాధితుల తరపున అవిశ్రాంతంగా పోరాటం చేసి వారి హక్కులను కాపాడటమే ధ్యేయంగా కృషి చేస్తానని తెలిపారు. మానవ హక్కులను ఏ ఒక్కరూ కాలరాసినా బాధితుల తరపున పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

◆ సీసీ రోడ్డు, డ్రైనేజీ కోసం వినతి

జహీరాబాద్ టౌన్: పట్టణం పరిధి జర్నలిస్టు కాలనీలో సీసీ రోడ్డు, మురికి కాలువలు నిర్మించాలని ఏపీయూడబ్ల్యూజే నాయకులు ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే మాణిక్‌రావును కలిసి వేర్వేరుగా వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు మిన్హాజ్ మాట్లాడుతూ.. జర్నలిస్టు కాలనీలో సీసీ రోడ్డు, మురికి కాలువలు లేక అవస్థలు పడుతున్నామని, చినుకు పడుతే రోడ్డు బురదమయంగా తయారవుతుందని వాపోయారు. మురికి కాలువలు లేక రోడ్డుపై మురుగు నీరు పారుతుందన్నారు. ఎంపీ, ఎమ్మెల్యేలు సానుకూలంగా స్పందించారన్నారని చెప్పారు.

◆ తారాలో ప్రపంచ జనాభా దినోత్సవం

సంగారెడ్డి ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ మాట్లాడుతూ.. ఆధునిక కాలంలో మానవ వనరుల కంటే మానవ నైపుణ్యాలే ప్రధానమైనవి అని, అత్యంత నైపుణ్యాలు కలిగిన జనాభా ఉన్న దేశాలు ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్నాయన్నారు. ప్రధానంగా అభివృద్ధి చెందుతున్న దేశాలు విద్యకు అధిక ప్రాధాన్యం ఇవ్వడమే కాకుండా బడ్జెట్‌లో అధిక కేటాయింపులు చేస్తున్నారు. కార్యక్రమంలో అర్థశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ అనురాధ, రాజనీతి శాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ జ్యోష్ణ, చరిత్ర డాక్టర్ వాణి, ఇతర అధ్యాపకులు డాక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.